భాస్కర బింబే దీప్తం దైవమ్
లోచన మధ్యే సుప్తం దైవమ్
శీతకర మండల గుప్తం దైవమ్
త్రిగుణిత భవనం వ్యాప్తం దైవమ్

ప్రేమస్వరూపులైన విద్యార్థులారా!

సర్వం ఖల్విదమ్ బ్రహ్మ. విశ్వం విష్ణు స్వరూపం. భాస్కర బింబే దీప్తం దైవమ్. సూర్యుని కిరణముల యందు ప్రకాశించేవాడు ప్రకటించేవాడు దైవమే. లోచన మధ్యే సుప్తం దైవమ్. ప్రతి మానవుని యొక్క నేత్రముల మధ్య జగత్తును చూపించి ప్రకటింపచేసి వికసింపజేసి ప్రకాశింప చేసేవాడు దైవము. శీతకర మండల గుప్తం దైవమ్. చంద్రుని మధ్యనున్న చల్లదనము, లోక శాంతిని అందించే దివ్యత్వము దైవమే. త్రిగుణిత భవనం వ్యాప్తం దైవమ్ త్రికాలాత్మకమైన యీ జగత్తునందు త్రిమూర్త్యాత్మకమైన యీ జగత్తునందు త్రిగుణ స్వరూపములో ప్రకటించే దివ్యత్వము భగవంతుడే.

ప్రకృతి యొక్క చిత్రము మహా విచిత్రము. ఎవ్వరును దీనిని గుర్తించలేరు. ముంచినా తేల్చినా, అనుగ్రహించినా ఆగ్రహించినా ప్రకృతియే. జీవకోటిపైన ఆధిపత్యము ప్రకృతిదే. ఈ ప్రకృతి త్రిగుణాత్మకమైనది. ఈ త్రిగుణాత్మకమైన ప్రపంచమే త్రిమూర్తి స్వరూపము ఇవియే సృష్టి స్థితి లయ మునకు మూల కారణము. త్రిగుణముల యొక్క స్వరూప స్వభావములతో విశేష వికారములతో, సరస సల్లాపములలో లోకాలను ప్రకాశింప చేసేది ప్రకటింప చేసేది త్రిగుణములే. మానవుడు దీర్ఘ జీవితము కోసము కాదు. ఆశించవలసినది. దివ్యజీవితము కోసము ఆశించాలి. దివ్యమైన యీ ప్రకృతి యందు, దివ్యమైన మానవత్వము దివ్యత్వమును పొందటమే ప్రధాన కర్తవ్యము. సృష్టి యొక్క రహస్యము సృష్టికర్తకు తప్ప అన్యులకు అర్థము కాదు. సృష్టి యొక్క రహస్యము గుర్తించటానికి ప్రయత్నించే వారే యీ సైంటిస్టులు. ఈ సృష్టి యొక్క రహస్యమును పరిపూర్ణముగా ఎవ్వరూ కూడను గుర్తించలేరు. ఈ వైజ్ఞానము నందు యీనాటి పరిశోధన రేపటికి పాతదై పోతుంది. రేపటి దినము పరిశీలన ఎల్లుండికి పాతదై పోతుంది. కాని యీ వైజ్ఞానిక వ్యక్తి యందు పాతదంతా రోతదిగా భావించకుండా

పోతుంటాడు. సృష్టి అంతయు కేవలము క్షణక్షణమునకు మార్పు చెందునదే. ఇది నిత్యమైనది సత్యమైనది కాదు. నిత్యసత్య నిర్మలమైన తత్వము సృష్టికర్తయే. సృష్టికర్తను పరిశీలన చేసి పరిశోధన చేసి సృష్టికర్తను పొందేటువంటిదే ఆధ్యాత్మిక మార్గము.

ఈ చరాచర ప్రపంచమంతయు కేవలము త్రిగుణాత్మకమైనది. కనుక గుణాతీతమైన తత్వమును గుర్తించినిమిత్తమే నిజమైన మానవత్వము. భగవంతుడు ఆత్మస్వరూపుడు సత్యం జ్ఞానం అనంతం బ్రహ్మ అని. బ్రహ్మ అన్నా సత్యమన్నా, అనంతమన్నా, ఆత్మ అన్నా, భగవంతుడన్నా, దేవుడన్నా యివి కేవలము ఒక పదము యొక్క పర్యాయ పదములే. మొట్టమొదట ఆత్మ నుండి పంచభూతములు ఆవిర్భవించాయి. ఐతే పంచభూతములందు పంచతత్వముల యొక్క తత్వాన్ని యిముడ్చుకొనివుంటాయి. ఈ పంచభూతముల నుండి పంచీకృతము ఆరంభమైంది. ఈ పంచీకృత భావమునుండి ఆవిర్భవించినవే యీ త్రిగుణములు. ఈ త్రిగుణముల యొక్క ఆకారమే ఈ విశ్వము. ఈ విశ్వమునందు సత్వరజోతమో గుణములనే త్రిగుణాత్మక స్వరూపము నిండివుంటున్నాది.

ఈ సత్వ సృష్టి యొక్క రహస్యాన్ని మొట్టమొదట గుర్తించాలి. పంచభూతములయొక్క సమిష్టి సత్వాంశమే యీ అంతఃకరణ.. ఐతే యీ ఆకాశము నుండి కూడను సత్వసృష్టియైన యిది వ్యష్టి తత్వాన్ని అనుభవిస్తూ వచ్చింది. ఈ పంచభూతములలో ఆకాశము మొదటిది. ఈ ఆకాశము నుండి వ్యష్టి తత్వము నుండి శుద్ధ సత్వము ఒకటి బయలుదేరింది. అదియే మానవాకారములకు ప్రధమస్థానము. మానవత్వమునకు యీవిధమైన అంశముల యొక్క ప్రభావము, ప్రశక్తి పరిపూర్ణతలను ప్రారంభము కావటము. కనుక ఆకాశము యొక్క వ్యష్టి సత్వము నుండి చెవి పుట్టింది. ఇంక పంచభూతములలో రెండవ భూతము గాలి నుండి వ్యష్టిసత్వామైన అంశమే చర్మము. మూడవదైన అగ్ని. ఈ అగ్నియొక్క వ్యష్టి సత్వాంశమే కన్ను. నాల్గవది నీరు. దీని వ్యష్టి సత్వాంశమే నాలుక. ఐదవ భూతము ప్రకృతి. ప్రకృతి యొక్క వ్యష్టిసత్వాంశమే ముక్కు. కనుక శబ్ద, స్పర్శ రూప, రసగంధములు అనే భూతములు ప్రధమమునందు సాత్వికమై శుద్ధ సత్వము నుండి ఆరంభమైనాయి.

ఐతే ఒక్కొక్క భూతమునకు వ్యష్టి భూతము కనుక ఆవ్యష్టినుండి ఆవిర్భవించిన యీ అంగములు ఒక్కొక్కపనికి మాత్రమే వినియోగించుకోటానికి వీలవుతుంది. ఆకాశము యొక్కగుణము శబ్దము. శబ్దమునకు చిహ్నము చెవి. చెవి కేవలము వినుట మాత్రమే తప్ప అన్యము ఎరుగదు. అదే విధముగనే రెండవ భూతమైనగాలి. ఇది స్పర్శ. చర్మము.

ఇది స్పర్శ తప్ప శ్రవణము చేయుటానికి వీలుకాదు. దీనికి శ్రవణ శక్తి లేదు. మూడవది అగ్ని. దీని అంశము కన్ను. ఇది చూడగలదే గాని స్పర్శించలేదు. నాల్గవది నీరు. ఇది జిహ్వ. నాలుక. రుచి చూడగలదే గాని వ్యక్తిని చూడలేదు. ప్రకృతి యొక్క అంశము ముక్కు. ఇది వాసన చూడగలదే గాని రుచిని చూడలేదు. ఐతే యీ అంశములయొక్క ప్రతిబింబములగుట చేత ఒక్కొక్క గుణము మాత్రమే యిది స్వీకరిస్తూ వచ్చింది. ఐతే సమిష్టి స్వరూపమైన పంచ భూతముల యొక్క స్వరూపమే అంతఃకరణ. అంతఃకరణకు శబ్ద స్పర్శ రూప రస గంధములన్నీ అనుభవించే అధికారము వుంటున్నాది. కనుక అంతఃకరణ అనగా కేవలము శబ్ద స్పర్శ రూప రసగంధాదులు జ్ఞానేంద్రియములకు మాత్రమే సంబంధించినది. ఐతే యీ జ్ఞానేంద్రియములు దేహమునకు వెలుపలా లోపలా అని విచారిస్తే యివి అంతర్బహిర్ స్వరూపాలు. కర్మేంద్రియమైన చెవి మాత్రమే వుంటుండి జ్ఞానేంద్రియమనే విను శక్తి లేక పోయినప్పుడు చెవి వుండి ప్రయోజనము లేదు. జ్ఞానేంద్రియమనే విను శక్తి వుండి కర్మేంద్రియమనే చెవి లేకపోతే యిది కూడను వినలేదు. జ్ఞానేంద్రియ కర్మేంద్రియ సమ్మిళితమైన స్వరూపమే వ్యష్టి యొక్క తత్వము. Loud Speakers బయట పెట్టారు. Loud Speaker వుంటుండి యిక్కడ mike లేకపోతే Loud speaker ప్రయోజనము లేదు. అక్కడ speaker వుండి యిక్కడ mike లేకపోతే ప్రయోజనము లేదు. కనుక యిక్కడ mike, speaker రెండింటి సమ్మిళితమైన స్వరూపమే యిక్కడి తత్వాన్ని అక్కడికి అక్కడి తత్వాన్ని యిక్కడికి ప్రసరింప చేస్తుంది. కనుకనే యీ శుద్ధ సత్వమైన సత్వ గుణ సంపత్తియే శబ్ద స్పర్శ రూప రస గంధాదులు. ఇవి సత్వగుణమునకు మాత్రమే సంబంధించినవి.

రజోగుణము యొక్క సమిష్టి పంచ భూతముల యొక్క స్వరూపమే ప్రాణము. సత్వగుణము యొక్క పంచ భూత స్వరూపమైనది అంతఃకరణ అయితే రజోగుణము యొక్క పంచ భూత స్వరూపము ప్రాణముగా వచ్చింది. ఇక్కడ రజోగుణ సృష్టియందు యీ పంచ భూతములందు వ్యష్టి స్వరూపమైన ఆకాశము యొక్క బిందువు నోరు. ఇంక రెండవ భూతమైన వాయువు. ఈ వాయువు యొక్క వ్యష్టి స్వరూపమైన బిందువు చేయి. రజోగుణ సృష్టియందు మూడవ భూతము అగ్ని, వ్యష్టి స్వరూపమైన అగ్ని యొక్క సృష్టి కాలు. నాలుగు, ఐదు అయిన జలము, ప్రకృతి యొక్క వ్యష్టి యొక్క సృష్టి మల మూత్రములు విసర్జించు ప్రదేశములు. ఇక్కడ చక్కగా గుర్తించవలసిన విషయము. సత్వగుణ సృష్టియందు వ్యష్టి సృష్టిగా వచ్చిన ఆకాశము యొక్క మొదటి సృష్టి చెవి. రజోగుణమునందు ఆకాశము యొక్క వ్యష్టి సృష్టియైనది

వాక్కు. ఏ తావాత ఆకాశమునకు యిద్దరు బిడ్డలు. రజోగుణము యొక్క బిడ్డ వాక్కు. సత్వగుణము యొక్క బిడ్డ చెవి. ఆకాశము మొదటి బిడ్డ చెవి. రెండవ బిడ్డ వాక్. మొదటి బిడ్డయైన చెవి బయటి విషయాన్ని లోపలికి స్వీకరిస్తుంది. రెండవ బిడ్డయైన వాక్కు స్వీకరించిన దానిని బయటకు విడిచిపెడుతుంది. సత్వగుణము యొక్క వాయువు యొక్క బిడ్డ చర్మము. రజోగుణము యొక్క వాయువు యొక్క బిడ్డ చేయి. ఎక్కడైనా దేహముపైన చీమ పారాడుతూవుంటే యీ స్పర్శ తెలుసుకుంటుంది చర్మము. తెలుసుకున్న తక్షణమే చేయి తీసి పారవేస్తుంది. ఇలా సత్వగుణము యొక్క అంశములు స్వీకరించుటము రజోగుణము యొక్క సంతతి దానిని విసర్జించటము. కనుక యీనాడు లోకములో యేరీతిగా వున్నదంటే రజోగుణము స్వీకరిస్తుంది సత్వగుణము వదిలివేస్తూవుంది. దీనిని వుల్టాసీదా అంటారు. విరుద్ధముగా నడుస్తూ వస్తుంది. సృష్టి యొక్క రహస్యము నిజరూపము సత్వగుణము మాత్రమే స్వీకరించాలి. రజోగుణము యొక్క తత్వము విసర్జించాలి. కనుక యీ ప్రకృతికి సత్వగుణమే మొట్టమొదటి పదము.

ఈ ప్రకృతికి స్త్రీ అని ఒక పేరు. స్త్రీ అనగా సకార తకార రకారముల కూడినటువంటిది. అనగా మొట్టమొదట సాత్వికము స్వీకరించాలి. రెండవది తకారమనే తమోగుణము అనగా మర్యాదగా వినయముగా అణకువగా వుండే గుణములు అభివృద్ధి పరచుకోవాలి. రకారమనేది కట్టకడపటిది. కొన్ని కొన్ని సమయములందు కొన్ని దీక్షలు, కొన్ని ప్రతిజ్ఞలు, కొన్ని కఠినమైన చర్యలను చేస్తుంది. కనుక రజోగుణమనేది విధిలేని పరిస్థితియందు కట్టకడపటికి స్వీకరించవలసినదేగాని మొదట స్వీకరించవలసినది కాదు. ప్రకృతి యొక్క రహస్యమునందు ప్రప్రథమములో ప్రారంభమయ్యేది సకారమే. అదే సాత్వికము. కనుక ప్రతి మానవుడు సత్వగుణ అంశమునందు, సత్వగుణ ప్రక్రియయందు, సత్వగుణ తేజస్సునందు, సత్వగుణ మార్గమునందు, సత్వగుణ ప్రవర్తనయందు మానవత్వము అభివృద్ధిగావించుకోవాలి.

ఇంక తమోగుణము యొక్క సృష్టి యేవిధముగా వున్నదంటే పంచభూతముల యొక్క మిశ్రమమై వుంటున్నది. ఇక్కడ పంచభూతములు పరిపూర్ణ భూతములు. మిశ్రమము కాలేదు. పంచీకృతములు యిక్కడ చేరిపోయాయి. అనగా యివి చక్కగా అందరికి అర్థమయ్యే విషయము కాదు. కాబట్టి అర్థమయ్యే నిమిత్తమై నేను ప్రాపంచిక సంబంధమైన విషయములో ఒక ఉపమానాన్ని చెబుతాను. ఇక్కడ ఆకాశము, వాయువు, అగ్ని, జలము, పృథ్వి యీ ఐదు సృష్టి స్వరూపాలు. ఈ ఐదు మంది ఒక చోట కూడినారు. ఒక్కొక్కరి దగ్గర ఒక్కొక్క రూపాయి వుంటున్నది. ఈ ఆకాశమనేవాడు తన రూపాయిని చిల్లరగా మార్చాడు. అర్ధరూపాయి తనదగ్గర

పెట్టుకొని రెండు రెండు అణాలు నలుగురికి పంచుతూ వచ్చాడు. అదే విధముగా రెండవ భూతమైన వాయువు కూడను తనరూపాయిని చిల్లర చేసి అర్థరూపాయి తనదగ్గర పెట్టుకొని తాను కూడా రెండు రెండు అణాలు నలుగురికి పంచుతూవచ్చాడు. ఇదే పద్ధతి మూడవది అగ్ని అనుసరిస్తూ వచ్చింది. తిరిగి జలము కూడును యిదే పద్ధతి అనుసరిస్తూ వచ్చింది. పృథ్వి కూడను అంతే. యీ పద్ధతినే అనుసరిస్తూ వచ్చింది. ఈ విధముగా అనుసరిస్తూ రావటం చేత కట్టకడపటికి వెళ్ళిపోయింది. అందరి దగ్గర రూపాయి రూపాయిగానే మిగిలింది. ఐతే యీరూపాయలు యేవిధముగా ఒక్కొక్కరూపాయిగా మిగిలాయి. పూర్వము గట్టిదైన ఒకేరూపాయి వుండినాది. ఇప్పుడు చిల్లరతో కూడిన రూపాయిగా మారిపోయింది. అనగా పూర్వము వుండిన పంచభూతములే గట్టిరూపాయి ఈ చిల్లర రూపాయలతో పంచీకృతమని. ఈ పంచీకృతముతో కూడిన మానవత్వము చిల్లర రూపాయలుగా చలామణి అవుతున్నాయి. అనగా చిన్న చిన్న భావములతో కూడివస్తున్నది. ఏకత్వమును అనేకత్వముగా భావించింది. పూర్వము అనేకత్వమైన ఏకత్వముగా వుండేటువంటిది. అదే రూపాయకు పదహారణాలు అనేది పూర్వము. ఇక్కడ మనిషికి పదహారు గుణాలు అని.

ఆధ్యాత్మిక తత్వమునందు షోడశ కళలు అన్నారు. ఈ పదహారు కళలు ఏమిటి? ఇక్కడ ఐదు జ్ఞానేంద్రియములు, ఐదు కర్మేంద్రియములు యీ ఉద్భవించిన పంచ భూతములు, మనస్సు ఒకటి యివే పదహారు కళలు. కేవలము భగవంతుని యందే యీ పదహారు కళలు వుంటున్నా యని భావించటము చాలా వెఱ్ఱితనము. ప్రతి వ్యక్తి కూడను పదహారు కళలతో వుంటున్నాడు. కనుకనే ఈశావాస్యమిదం సర్వం. ఈశావాస్య ఉపనిషత్తునందు ఈశ్వరుడు సర్వత్రా వుంటున్నాడు. ఈశ్వర స్సర్వభూతానాం. ఈ మానవుడు ఏకత్వాన్ని అనేకత్వముగా మార్చటానికి వచ్చిన కారణము యేమిటి? దీనికి అభీష్టము లే మూలకారణము. ఈ అభీష్టములు క్రమక్రమేణా మితి మీరి పోతూ వచ్చాయి. ఈ పంచభూతములకు సంబంధించిన వాంఛలు అత్యవసరము. ఇవి క్రమక్రమేణా మితిమీరిపోవటం చేత ప్రతి ఒక్కటి అప్పటికప్పుడే అప్పటికప్పుడే ఫలితము లభించాలి కాలము కోసము కూడను కాచుకోడు. త్రికాలస్వరూపమైనదే యీ త్రిగుణములు. ఈ కాలము వచ్చిందంటే యిది కూడను ఎవ్వరు ఆపటానికి వీలుకాదు.

పోకన్నానదు దేహము యే విధంబు పోషించి రక్షించినన్
రాకన్నానదు హాని వృద్ధులు మహారణ్యమందున దాగినన్.

ఈ సత్యాన్ని గుర్తించి కూడను వ్యక్తులు యేందో ఆతృత పడుతూ వుంటారు. అక్కడకు పోతే తప్పుతుందేమో ప్రమాదము అని. ఇక్కడ వుంటే లాభిస్తుందో యేమో అని అనుకుంటారు.

ఎక్కడ వుండినా వచ్చేది రాక తప్పదు. ఐతే పురుష ప్రయత్నము అత్యవసరము. వుండేది తట్టలో పాటాటో చపాతీ లభించింది గాని తట్టలో వున్నది పొట్టలోకి చేరాలంటే నోటికి చేతికి పని పెట్టాలి. ఇదే పురుషప్రయత్నము. కలియుగ ప్రభావము చేత కోరికల యొక్క బలము చేత మానవత్వమును విస్మరించి అభీష్ట జీవితమును అభిలషించి అత్యంత ఉన్నత స్థాయికి అతి శీఘ్రముగా పోవాలని short cut కోసం ప్రయత్నిస్తున్నాడు. short cut త్వరగా చేరవచ్చుననుకుంటారు. చూడటానికి చాలా దగ్గరగా కనుపిస్తుంది. కాని ఆ short cut లోపల అనేక రాళ్లు ముళ్ల కంపలు అనేక రకములైన బాధలతో కూడి వుంటుంది. ఇవన్నీ తప్పించుకొని ఆ గమ్యం చేరటానికి main road లో దానికంటె నాలుగింతలు అధికమైనప్పటికి సులభముగా నడచి అందులో చేరటానికి టైము ఒకటైతే అవుతుంది. కాని మానవుడు త్వరగా చేరే మార్గాన్ని వెతుకుతూ వస్తున్నాడు. ఇది సరియైనది కాదు. దూరమైనప్పటికిని మంచి రాజమార్గములో మనము ప్రవేశించాలి.

ఇక్కడ ఒక చిన్న ఉదాహరణము వుంటున్నది. స్వర్గమునకు పోయే రోడ్డు చాలా చిన్నదిగా వుంటుందట. నరకమునకు పోయే రోడ్డు చాలా పెద్దదిగా కనుపిస్తుందట. ఏమిటి యింత పెద్ద main road గా వుంటున్నది. దీనికి యింత పెద్దరోడ్డు ఎందుకు. భగవంతుని దగ్గరకు పోవటానికి యింత చిన్న రోడ్డు ఎందుకు. అని ప్రశ్నించవచ్చు బుద్ధిననుసరించి. భగవంతుని సృష్టి అనేక రకములైన విచారణలు సల్పి వివేక భావముతో, విజ్ఞాన హృదయముతో, విశాల తత్వముతో యేర్పరచినటువంటిది. నరకమునకు పోయేవారు లక్షలు లక్షలమంది వున్నారు. వెళ్లటానికి పెద్ద రోడ్డు కావాలి. స్వర్గమునకు పోయేవారు ఒకరో యిద్దరో నూటికి ఒక్కరో కోటికి ఒక్కరో. వారికి పెద్ద రోడ్డు అవసరం లేదు. చిన్నరోడ్డు చాలు. అదే విధముగానే భగవంతుడు ప్రతి ఒక్కటి కూడను తన యొక్క సంకల్పములో యోగక్షేమం వహామ్యహమ్ అన్నింటి యొక్క క్షేమము నిమిత్తమై సృష్టిని ఆచరిస్తూ వుంటాడు. ఒక భక్తుడు తాను శ్రీమంతుడు కావాలని ఆశించి లక్ష్మీదేవిని ప్రార్థిస్తూ వచ్చాడు. భౌతిక వాంఛలు నెరవేర్చుకొనే నిమిత్తమై భక్తుడు ఎంతటి శ్రమలకైనా ఓర్చుకుంటాడు. ఎన్ని కష్టములనైనా సహిస్తాడు. ఎన్ని నిందలు నిష్ఠూరములకైనా గురౌతాడు. కాని పారమార్థిక మార్గమునకు ప్రయత్నించే భక్తులు ఏ చిన్న కష్టము జరిగినా తాను భరించుకోలేడు. దీనిని బట్టి భౌతిక వాంఛలపైన మానవులకు అమితమైన అభిమానము వుంటున్నది. ఈ భక్తుడు లక్ష్మీ కటాక్షము కోసమని చాలా ఘోరమైన తపస్సు చేశాడు. లక్ష్మి ప్రత్యక్షమైంది. 'నాయనా! నీకేమి కావాలి?' అంది. 'నీవే కావాలి తల్లీ' అన్నాడు. వెంటనే సర్వాలంకార

భూషితురాలనై నీవెంటనే వస్తాను. నీవు ముందు నడు. నీ యింటికి వచ్చి యీ నగలన్నీ అక్కడ విసర్జించి వస్తాను అంది. కానీ ఒక నియమాన్ని పాటించాలని కోరింది ఆమె. నీవు ముందు మాత్రమే వెళ్ళు వెనుకకు తిరిగి చూడకు. వెనుకకు తిరిగి చూస్తివా నేను అక్కడే నిలచిపోతాను. ఆమె నిజమే చెప్పింది. ఆనంద హృదయుడై వుల్లాసములో వురుకుతూ వున్నాడు ఎప్పుడెప్పుడు యింటికి పోయి చేరాతానాఅని. కొంత దూరము పోయేటప్పటికి చాలా శబ్దములు యిస్తుంది యీమె. ఏవే నగలు ధరించిందో యేమోనని ఒక్కతూరి వెనుకకు చూచాడు. ఇంటికి పోయేంత వరకు ఓపిక లేకపోయింది యీయనకు. వెనకకు తిరిగి చూచేటప్పటికి ఆమె అక్కడే నిలచి పోయింది యింక యింటికి పోలేదు. చూశారా! ఆశ యొక్క ప్రభావము. అనుగ్రహమును పొంది కూడను అనుభవించ లేకపోతున్నాడు. కనుక భగవదనుగ్రహము నిండుగా దండిగా వుండినప్పటికి అనుభవించే శక్తిని కూడా మనము సంపాయించాలి. అది అనుభవించే శక్తిని మనము సంపాయించుకోవాలంటే ఆజ్ఞను పాలించాలి. లక్ష్మీదేవి యొక్క ఆజ్ఞను పాలించి వుంటే ఆ లక్ష్మి తనకు వచ్చి చేరి వుండేది కదా. ఆజ్ఞను మీరటం చేతనే లభించిన లక్ష్మిని కూడను కోల్పోయాడు. లోకము యొక్క స్థితి యీ రకముగా వుంటున్నది.

లోకమంతా సత్వ రజో తమో గుణముల యొక్క ప్రభావమై వుంటున్నది. ఈ సత్వ రజో తమో గుణముల యొక్క సృష్టి కూడను మన యొక్క దృష్టి యందు చేరి వుంటున్నది. మన నేత్రములు చూడండి చక్కగా పరిశీలన చేసి. మొట్టమొదట కొసలో Red colour వుండే రజోగుణము. అది దాటుతూనే సాత్వికము. ఆ సాత్వికమునకు మధ్య లోపలనే తమోగుణము వుంటుండాది. అదే నలుపు. తెలుపు, ఎరుపు, నలుపు మూడు గుణములు మన దృష్టి యందు కూడా వుంటున్నాయి. దైవము ఎక్కడ వున్నాడు, ఎట్లా వుంటాడు, మనకు ప్రత్యక్ష స్వరూపకముగా ప్రకృతియే మనకు గురువుగా యిస్తున్నది. సూర్యోదయము, సూర్యాస్తమయము కలుగుతున్నాయి ఈ సూర్యోదయ సూర్యాస్తమయముల వల్ల దినములు వస్తున్నాయి. ఈ దినముల వలన నెలలు నెలల వల్ల సంవత్సరములు వస్తున్నాయి. ఇది జరగటానికి కారణం యేమిటి? భూమి తన చుట్టూ తాను వేయిమైళ్ళ వేగము తో తిరుగుతున్నది. తిరగటం చేతనే సూర్యోదయము సూర్యాస్తమయము జరుగుతున్నాయి. కేవలము సూర్యోదయము సూర్యాస్తమయము జరగటం వలన మనకు లభించే ప్రయోజనము యేమిటి? కానీ భగవత్సంకల్పము చాలా విశాలమైనది. ఎవ్వరూ దీనిని అర్థము చేసుకోలేరు. అదే భూమి తిరిగి సూర్యుని చుట్టూ 66 వేల మైళ్ళ వేగము తో తిరుగుతున్నది. తన చుట్టూ తాను వేయిమైళ్ళ గంటకు తిరుగుతూ సూర్యుని చుట్టూ

అరపై ఆరు వేల మైళ్ళ వేగముతో తిరుగుతున్నది. ఈ సూర్యుని చుట్టూ తిరగటము మూలముగా ఋతువులు యేర్పడుతున్నాయి. ఈ ఋతువుల వలన వర్షములు కురుస్తున్నాయి. పంటలు పండుతున్నాయి. పంటకు యేమి తక్కువ లేకుండా వుంది. కనుక మన యొక్క ఆహార విహారములకు యీ భూమి యెంత వుపకారముగా వుంటున్నది. ఇదియే ప్రత్యక్షదైవము. నేవు భగవంతుని చూస్తూ కూడను చూడలేదు అనుకుంటున్నావు. చాలా పొరపాటు. ప్రకృతియే పరమాత్మ స్వరూపము.

ఈ ప్రకృతి వల్ల మనము గుర్తించవలసినది యేమిటి? క్రియాశీలత. మన కర్తవ్యమును మనము నిర్వర్తించాలి. ప్రకృతి తన కర్తవ్యమును తాను పాటిస్తూ వుండటం చేతనే యింత పవిత్రమై జగత్తుకు ఉపకారము చేయగలుగుతున్నది. కనుకనే సృష్టి యొక్క రహస్యము కర్తవ్యాచరణాయే. ఏ కర్మలో నీవు ప్రవేశిస్తున్నావు ఆ కర్మ నీవు శ్రద్ధా భక్తులతో చేయి. అయితే గాని మానవుడు యేదో సుఖించాలని యీ సుఖము కోసమని అనేక పెడమార్గములు పడుతున్నాడు. ఈ ఆధునిక యుగమునందు ఆంగ్లవిద్యా ప్రభావమందు విద్యార్థుల యొక్క తత్వములు విద్యావంతుల యొక్క ప్రభావములు వికార మార్గమును అనుసరిస్తున్నాయి. మీ అందరికి తెలుసు అనేకమంది అధికారులు ఆఫీసుకు వెడుతున్నారు. ధనవంతులు తమ తమ ఆఫీసులకు పోతుంటారు. తమ పనులు తాము చేస్తుంటారు. వారు పెద్ద శ్రమపడి వచ్చినట్లుగా యింటికి వస్తారు. మాకు సుఖము లేదు శాంతి లేదు అని వాపోతుంటారు. ఇంటికి వచ్చి happy నిమిత్తమై తమ తమ డ్రస్సులు తాము విసర్జించి యింకొక డ్రస్సును స్వీకరించి క్లబ్బులకు వెడతారు. దేనికోసం వెడతారు happy కోసం, సంతోషము కోసము పోతున్నారు. Rest కావాలి. నిజముగా అక్కడ happy వున్నదా? నిజముగా అక్కడ శాంతి వున్నదా? నిజముగా అక్కడ సుఖము వున్నదా? ఆ క్లబ్బులకు పోవటము cards ఆడటము, బాటిల్సు లేసుకోటము శాంతిగా ప్రపంచమును మరచి కూర్చోటము. ఇంకా యింకా మద్యము ధూమపానీయం సమర్పయామి యేమేమో చేస్తుంటారు. ఇవన్నీ కేవలం సుఖశాంతి నిమిత్తమై ఆచరించే సత్కార్యములుగా భావిస్తున్నారు. ఇది చాలా దుర్మార్గమైన మార్గము. ఈ సుఖము సుఖమనే అపేక్షలో దుఃఖమును వారు కొంటున్నారు. వారికి వారు చెడిపోటమే కాకుండా వారు సమాజమును కూడను చెడగొడుతున్నారు. ఈ విధమైన మార్గము మొట్టమొదట చాలా సుఖంగా కనుపించవచ్చు. ఇది పోతూ పోతూ క్రమక్రమేణా ఎక్కడ దిగుతుంది. First the man drinks the wine, second the wine drinks the wine, third wine drinks the man.

228059009

ఇది జరుగుతుంది. కేవలము తాను తీసుకుంటున్నానని భ్రమిస్తున్నాడు కాదు. కాదు. అదే తనను తీసుకుంటున్నది. ఈ విధమైన శాంతి గోరి పెడ మార్గమును బట్టి జీవితమును భ్రష్టు పట్టించుకుంటున్నారు. నిజమైన శాంతిసుఖములు అనుభవించాలనుకుంటే Public service చేయి. సమాజములో ప్రవేశించు. దీనులను దిక్కులేని వారిని పోషించు. దానిలో నీయొక్క energy కూడను అభివృద్ధి అవుతుంది. మానసిక శాంతి కూడను లభిస్తుంది. నీవు చేసిన మంచిపని అని నీ conscious తృప్తి పడుతుంది. ఈ రకమైన మార్గమునందు ప్రవేశించటానికి యీ ధనవంతులకు గాని అధికారులకుగాని బుద్ధి పుట్టదు.

విద్యార్థులారా! విద్యార్థులు మున్ముందు దీనిని లక్ష్యమునందుంచుకొని తమశక్తిని తమ యొక్క పవిత్రతను తాము అనుభవించుటే కాకుండా సమాజమునకు కూడను దానిని వినియోగించాలి. కారణమేమనగా నీవు కూడను సమాజములో ఒక వ్యక్తివి. నీవు సమాజమునకు దూరముగా లేవు. కనుక నీక్షేమము అంతా సమాజము క్షేమముపైనే ఆధారపడి వుంటుంది అప్పుడే నీక్షేమము కూడను అభివృద్ధి అవుతుంది. ఇదే నిజమైన మానవుని కర్తవ్యము. ఈ కర్తవ్యమును విస్మరించి దుర్భావములను విశ్వసించి దుర్మార్గములో ప్రవేశించటం చేతనే శాంతిసుఖములకు దూరమై పోతున్నాము. భగవంతుడు నీవే. నీయొక్క తత్వమే భగవత్ శక్తి. దీనినే energy అన్నారు. ఐతే మనకు తెలివితేటలు అధికముగా వుంటున్నాయి ఈ తెలివితేటలంతా కూడను దుర్వినియోగము చేస్తున్నారు. తెలివితేటలు వుండి కూడను ఆ తెలివితేటలు సక్రమమైన మార్గములో ప్రవేశించకుండా పోతే ఆ తెలివితేటలు నిరుపయోగమై పోతాయి. తెలివితేటలు లేకుండా నీవు కార్యములో ప్రవేశిస్తే కార్యము నిష్ప్రయోజనమై పోతుంది. Knowledge without action is foolishness. Action without knowledge is useless. ఈ knowledge, action రెండింటిని మనము యేకము చేయాలి. ఇదే దివ్యత్వము, ప్రకృతి తత్వము రెండింటి యేకత్వము. కనుక యీ creation ప్రత్యేకముగా భగవంతునికి వేరుగా లేదు. భగవంతునితోనే కూడి వుంటున్నది. అందు కోసమనే జీవ ఈశ్వర ప్రకృతి అని త్రిమూర్త్యాత్మక స్వరూపము. ఈ మూడు వేరు కదు. వేరు వేరు రూపనామములుగా మనకు గోచరిస్తుండగాని వున్నది ఒకటే. ఇది యేమిటి? ఇది వస్త్రము. అయితే యిది వస్త్రము ఎట్లా అయింది. దారములతో వస్త్రమైంది. ఈ దారము ఎట్లా అయింది. ప్రత్తిలో దారములుగా యేర్పడినాయి. ప్రత్తి లేక దారము లేదు. దారము లేక వస్త్రము కాలేదు. కనుక ప్రత్తి, దారము, వస్త్రము ఏకమే. మన వినియోగములు దీనికి

రూపనామములు వేరు వేరుగా వచ్చాయి. కనుకనే

త్రిదళం త్రిగుణాకారం త్రినేత్రంచ త్రియాయుధమ్
త్రిజన్మ పాపసంహారం ఏకబిల్వం శివార్పణమ్.

అన్నారు. ముఖ్యమైన మన త్రిగుణముల యొక్క తత్వము ఏకత్వమైన సత్య తత్వముతో కూడి వుంటున్నాది.

విద్యార్థులారా! ఏ సాధనలు మనము చేయక పోయినప్పటికిని భగవత్ప్రేమ మనము అమితముగా పెంచుకోవాలి. ఒకే నిర్మల నిశ్చలమైన ప్రేమను మనము పెంచుకుంటే మనకు సర్వమూ లభ్యమై పోతుంది.

వాల్మీకి ఎవ్వని వంశమందలి వాడు
నందుండు ఏ పల్లెయందు పుట్టె
వసుధ ధ్రువుండెంత వయసు కల్గియుండె
శబరి ఎంతటి శక్తి కల్గియుండె
విదురుని కెంతటి వితరణ మతియుండె
తిమ్మని కెంతటి తెలివియుండె.

చంచలత్వమునకు పుట్టినిల్లు పెట్టినది పేరు హనుమంతునికి. అతడు రాములకు ప్రియమైన near and dear అన్నింటికిని తాను ముఖ్యమైన వాడుగా వున్నాడంటే దీనికి కారణం ఏమిటి? ఇక్కడ ఒక విషయాన్ని తన తెలివితేటల తత్వాన్ని మీరు చక్కగా గుర్తించవచ్చు. పరమ భక్తియే పవిత్రమైన శక్తిని అందిస్తుంది. ఇతను రామాజ్ఞను శిరసా వహించి ఎన్ని కష్టములకైనా, ఎన్ని బాధలకైనా కూడను తాను సహించి రామాజ్ఞను నేను శిరసా వహించుటయే కర్తవ్యమని విశ్వసించాడు. ఆజ్ఞ యిచ్చిన భగవంతుడు శక్తి కూడా తానే యివ్వగలడు. సీతాన్వేషణకై నన్ను పంపుతున్నాడు. ఆ అన్వేషణ శక్తి కూడా తానే యివ్వగలడు. ఆ శక్తియే తాను యివ్వకుండిన ఆజ్ఞాపించుటానికి ఒప్పుకోడు. కనుక ఆ విశ్వాసముతో తాను పూనుకున్నాడు సీతాన్వేషణకు. లంకలో ప్రవేశించాడు. విభీషణుని తో స్నేహము చేసుకున్నాడు. వారిద్దరి మధ్య సంభాషణ జరుగుతున్నాది. హనుమంతా! నీవు ఎంత అదృష్టవంతుడవు అంటున్నాడు విభీషణుడు. శ్రీరామదర్శనము నీవు చేసుకున్నావు. శ్రీరామ సేవను నీవు సలుపుతున్నావు కాని నేను యెంతో కాలమునుండి రామ చింతన చేస్తూ వున్నాను గాని నాకు రామ దర్శనం కలగలేదు. హనుమంతుడు దీనికి కారణమేమిటో నీవు గుర్తించు

కున్నావా విభీషణా అన్నాడు. ఇంతటి కారణము తెలుసుకొనే వ్యక్తిని నేనైతే యింక దర్శనము కాలేదని విచారము నేను చేసి వుండి వుండను. అప్పుడు హనుమంతుడు చెప్పాడు. నీవు రామ చింతన చేస్తున్నావేగాని రామకార్యములో పాల్గొంటున్నావా? ఈనాడు భగవచ్చింతన చేస్తున్నాముగాని భగవత్కార్యములలో యెప్పుడైనా పాల్గొంటున్నామా. నేను రామ చింతన చేయుటయే కాకుండా రామకార్యమునకు జీవితమును అంకితము చేశాను. ఇదే రాముడు నన్ను దగ్గర చేర్చుకోటానికి తగిన అర్హత. నేను ఏ వేదము ఏ శాస్త్రము ఏ ఉపనిషత్తు దేనిని వర్ణించలేదు నేర్చుకోలేదు. కనుక ఆ రామ చింతనతో బాటు రామకార్యములో నా జీవితమును అంకితము చేశానన్నాడు. తదుపరి హనుమంతుడు ప్రశ్నించాడు. విభీషణా తల్లి సీతమ్మను చూచావా నీవు అడిగాడు. చూచాను హనుమంతా! మరి ఆ సీత యొక్క విముక్తి నిమిత్తమై ఏమైనా ప్రయత్నము చేశావా? చేయలేదు. రామ భక్తి రామ భక్తి అనుకుంటున్నావు. రామపత్ని సీత యిన్ని కష్టములు పడుతుంటే రాముని చెంత చేర్చటానికి నీవు కృషి చేయలేదు. ఇతే యిందులో మన మిద్దరము కూడను ఒక విధమైన స్నేహముతో ఒక విధమైన సమన్వయము వున్నాము. నీవు అన్నను చూచావు. నేను అప్పను చూచాను. కనుక నీవు నాకు అన్నను చూపించు. నేను నీకు అప్పను చూపిస్తానన్నాడు. అప్పుడు యిరువురు కూడను అప్ప అన్న చూచిన వారములాము. ఈ విధముగా యిరువురు నిర్ణయానికి వచ్చారు.

మరొక సందర్భములోపల హనుమంతునితో మాట్లాడుతూ విభీషణుడు అంటున్నాడు. హనుమంతా నేను ఎక్కడ వున్నానో తెలియదా. కోమలము సూటియైన అంబుల పొదులవంటి దంతముల మధ్య నాలుక వుండినట్లుగా యీ క్రూర రాక్షసుల మధ్య నేను నిల్చివుంటున్నాను. రామ చింతన చేయుటానికి కూడను సదవకాశము లభించటము లేదు. హనుమంతుని యొక్క తెలివి తేటలు ఎంత గొప్పవో ఆ రామానుగ్రహము వలన కలిగిన యీ తెలివి తేటలు ఎంత గొప్పవో విద్యార్థులు చక్కగా గుర్తించవచ్చు. ఈ మాట విన్నంతనే హనుమంతుడు చెబుతున్నాడు. 'విభీషణా! పళ్లు ముందు రాలతాయా? నాలుక ముందు రాలుతుందా? ముందు పండ్లు రాలుతాయి నాలుక ముందు రాలదు. కనుక దంతములకు మధ్య వుండినట్లుగా రామ చింతన చేస్తూ వుంటావు రాక్షసుల మధ్య. రాక్షసులు ముందు కూలిపోతారు. నీవు రక్షింపబడతావు. దీనికై నీవు విచారించనక్కరలేదు'. అన్నాడు. హనుమంతుని యొక్క గుణము ఎంత సూక్ష్మముగా వుంటున్నాది యోచించండి. కనుకనే ఆ విభీషణుడు శాంతుడు, గుణవంతుడు, హనుమంతుడు అని వర్ణిస్తూ వచ్చాడు. ఈ శాంత గుణము

బలము అన్ని మనకు ఒక్క ప్రేమ ద్వారానే లభ్యమవుతాయి. భగవత్ప్రేమ సంపూర్ణమైన హృదయముతో వుండెనా సర్వము మనకు లభమై పోతుంది. కనుక భగవత్ప్రేమను మనము అనుభవించిన త్రిగుణముల యొక్క స్వాధీనము మనకు జరుగుతుంది. త్రిగుణములను సాధించిన వ్యక్తి త్రిలోకములను సాధించగలడు. వాటిని సాధించక యింకే ఎన్ని సాధించి ఏమి ప్రయోజనము.

చిన్న విద్యార్థి యైన ప్రహ్లాదుడు పెద్ద హిరణ్యకశిపుడైన తండ్రికి బుద్ధి చెబుతున్నాడు.

లోకము లన్నియున్ ఘడియలోన జయించిన వాడ వింద్రియా
నీకము జిత్తమున్ గెలువ నేరవు....

ఓ తండ్రీ ఎన్ని లోకాలో నీవు సాధించావు. ఎందరు రాజులనో నీవు పరాభవము గావించావు. ఎన్ని రాజ్యములనో పొందావు. కానీ నీ యొక్క యింద్రియాల్ని నీవు జయించలేక పోతున్నావు. ఎన్ని జయించి యేమి ప్రయోజనము. కనుక బయటి రాజ్యములు జయించిన వాడు రాజు కావచ్చు ఇంద్రియాల్ని జయించినవాడు రాజాధిరాజ రాజ మహారాజు. అతను చక్రవర్తి కాగలడు. హృదయ సామ్రాజ్యమునకు చక్రవర్తి అవుతాడు. కనుక విద్యార్థులు యింద్రియములను అరికట్టి పవిత్రమైన మార్గములో ప్రవేశ పెట్టి మీ కర్తవ్యములను నిర్వర్తించుటకు కంకణము కట్టుకోవాలి. ఆదర్శవంతమైన జీవితాన్ని అందించాలి విద్యార్థులు. హృదయాన్ని విశాలము గావించుకోండి.

ఈనాడు ప్రపంచములో ఎక్కడ చూచినా వాతావరణము మాలిన్యముగా వుంది. ఆహారము మాలిన్యముగా వుంటున్నది. తినే పదార్థము మాలిన్యముగా వుంటున్నది. సర్వము మాలిన్యమయంగా వుంటున్నది. దీనిని మనము ఏవిధముగా పరిశుద్ధము చేయాలి. ఒక్క ప్రేమ భావమును మీరు అభివృద్ధి పరచుకొని సమాజములో ప్రవేశించండి. మీ వెంటనే యింటనే జంటనే కంటనే వుంటుండి సర్వవిధముల మీరు విజయమును సాధించటానికి తగిన శక్తి నందిస్తాడు భగవంతుడు. అట్టి విశ్వాసమును మీరు మొట్టమొదట బలపరచుకోవాలి. స్వార్థమును త్యాగము చేయండి. పరార్థమును ప్రేమించండి. దైవప్రీతి, పాపభీతి సంఘనీతి యీ మూడింటిని మీరు అభివృద్ధి పరచాలి.